క్లుప్తంగా

ఘనంగా వాల్మీకి జయంతి



భీమవరం రెల్లికాలనీలో వాల్మీకి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

భీమవరం: ఆదికవి వాల్మీకి జయంతి కార్యక్రమాన్ని సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో బుధవారం భీమవరం పట్టణం రెల్లికాలనీలో నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి వేదిక జిల్లా సంయోజక్ గూడూరి సాంభమూర్తి పూలమాలవేసి మాట్లాడుతూ పురాణ రచయితైన వాల్మీకి మహర్షిని భగవత్ సమానుడి కొలుస్తారన్నారు. బోయ కులంలో పుట్టిన వాల్మీకి రామాయణ మహా కావ్య రచన చేసి మహాకవిగా గుర్తింపబడ్డారన్నారు. ఈ కార్యక్రమంలో గరికిముక్కు సుబ్బయ్య, చందన్ సింగ్, నున్న అంజిబాబు, దుర్గాప్రసాద్, ముదుండి బంగార్రాజు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజశేఖర్‌కు సత్కారం



బంగారుగూడెం అరుంధతీపేటలో రాజశేఖర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని బంగారుగూడెం అరుంధతీ పేటలో మంగళవారం రాత్రి జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటి సభ్యుడు కొల్లి రాజశేఖర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడు తూ ఎస్సీ, ఎస్టీ సమస్యల పరిష్కారానికి రాజశేఖర్ కృషి చేస్తారన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. సామాజికవర్గ ప్రజలంతా కలిసికట్టుగా ఉండి ఐక్యతను చాటుకోవాలన్నారు. తద్వారా సమస్యల పరిష్కారం సుగమం అవుతుందన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు సమయమంతుల కాశీవిశ్వేశ్వరరావు, కార్యదర్శి నెల్లూరు శ్రీనివాస్, కొడవటి రాజేష్, ఎమ్మార్పీఎస్ నాయకులు కండెల్లి రాజేష్, దూలపల్లి ఆనంద్, పెంటపాడు ఎస్సీ మోర్చా సీనియర్ నాయకులు పాతకాకుల నాగరాజు, ఉలంపర్తి ఏసేపు, పోలిపో అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు సీమంతాలు



గర్భిణులకు పండ్లు ఇస్తున్న డాక్టర్ ఆనంద్

తణుకు అర్బన్: మెంటల్ హెల్త్ అండ్ వెల్ బీయింగ్‌పై పైడిపర్రులోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం గర్భిణులకు మానసిక వైద్యులు డాక్టర్ కుదారి ఆనంద్ అవగాహన కల్పించారు. లయన్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో లయన్ డిస్ట్రిక్ట్ సర్వీస్ కోఆర్డినేటర్ వంక రాజకుమారి సౌజన్యంతో 30 మంది గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ సీడీపీవో శ్రీలక్ష్మి, సూపర్‌వైజర్ మహాలక్ష్మి, మాజీ గవర్నర్ మాదిరెడ్డి బాబూజీ రావు, ఫ్యామిలీ కౌన్సెలర్ కుదారి సజిని, డాక్టర్ వసుంధర, జవ్వాది తమ్మయ్యనాయుడు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


పేదలకు చీరల పంపిణీ



తణుకులో పేద మహిళలకు చీరలు అందజేస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: కారుమంచి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం సినీ డైరెక్టర్ దాసరి మారుతి జన్మదినాన్ని పురస్కరించుకుని పేదలకు అన్నదానం, వస్త్రదానం చేసినట్లు ఫౌండేషన్ చైర్మన్ కారుమంచి యోహాన్ తెలిపారు. తణుకు శివారులోని కంపోస్టు యార్డులో నివసిస్తున్న పేదల మధ్య కేకు కట్‌చేసి ఆహార ప్యాకెట్లు, చీరలు అందచేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు మల్లిపూడి సన్నీ, ఉండ్రాజవరపు చరణ్, కారుమంచి ప్రవీణ్ పాల్గొన్నారు.

మానవత సేవలు అభినందనీయం



తణుకులో దివ్యాంగురాలికి వీల్‌చైర్ అందచేస్తున్న మానవత సభ్యులు

తణుకు అర్బన్: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగురాలికి వీల్‌చైర్ అందజేసినట్లు సంస్థ అధ్యక్షుడు కడించర్ల రాజరాజేశ్వరరావు తెలిపారు. తణుకు మహాలక్ష్మి జ్యూయలర్స్ యజమాని బొండాడ నాగేశ్వరరావు, పద్మ శేషారత్నం దంపతుల కుమారుడు బొండాడ జయప్రకాష్ ఆర్థిక సాయంతో తణుకు బొమ్మలవీధిలో నివసిస్తున్న దివ్యాంగురాలు కుమిలి దేవి వెంకట సత్యవతికి బుధవారం వీల్‌చైర్ అందజేశారు.

పంచాయతీ భూమి పందేరం!

- లక్షలాది విలువ చేసే భూమి తాపీ సంఘానికి కూటమి నాయకుల అప్పగింత
- చోద్యం చూస్తున్న అధికారులు



యనమదుర్రులో తాపీ పనివారల సంఘానికి కూటమి నాయకులు ఇచ్చి పంచాయతీ స్థలం

భీమవరం అర్బన్: ఎవరిదైన సొంత భూమిలో గజం పోతేనే కోట్లాటలు, కేసులు పెట్టుకునే ప్రస్తుత తరుణంలో లక్షలాది విలువ చేసే పంచాయతీ పోరంబోకు భూమిని కూటమి నాయకులు దారదత్తం చేయడంతో గ్రామస్తులు నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర స్థాయి నుంచి గ్రామీణ స్థాయి వరకు నాయకులు ఎక్కడిబడితే అక్కడ భూ దందా చేయడంతో చూసిన ప్రజలు నోరెళ్లబెడుతున్నారు. ఎదిరించిన వారిపై అక్రమ కేసులు పెట్టి, ప్రభుత్వ పథకాలు నిలుపుదల చేయడంతో మిన్నకుండిపోతున్నారు. భీమవరం మండలంలోని యనమదుర్రు గ్రామంలో పంచాయతీ పరిధిలో శివాలయం ట్యాంకు పోరంబోకు స్థలం సుమారు 4 సెంట్లు భూమి రూ. 25 లక్షలు వరకు ప్రస్తుత మార్కెట్ ప్రకారం విలువ ఉంటుంది. అయితే కూటమి నాయకులు ఆ స్థలాన్ని పంచాయతీ నిబంధనలు ఉల్లంఘించి ఎటువంటి గ్రామ తీర్మానం లేకుండా తాపీ పనివారల సంఘానికి దారదత్తం చేయడంతో తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

> **నోటీసులు ఇస్తాం**
>
> సదరు పంచాయతీ భూమిలో శంకుస్థాపన చేసి పునాదులు వేస్తే వెంటనే నోటీసులు ఇచ్చి అడ్డుకుంటాం. ఇటువంటి వాటిపై వెంటనే చర్యలు తీసుకుంటాం.
>
> వీర్రాజు, పంచాయతీ కార్యదర్శి యనమదుర్రు

ఆ స్థలాన్ని చదును చేసి శంఖుస్థాపన పునాదులు వేసేందుకు సిద్ధం చేసినా పంచాయతీ అధికారులు, ప్రభుత్వ యంత్రాంగం చోద్యం చూస్తున్నారు. కూటమి నాయకులు తమకు అనుకూలంగా ఉండే తాపీపనివారి సంఘానికి కట్టబెట్టడం చాలా దారుణమని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో ఆ భూమిలో అందరికి ఉపయోగపడేలా సబ్ స్టేషన్ నిర్మించేందుకు ప్రతిపాదించగా కూటమి నాయకులు వద్దని చెప్పడంతో నిలుపుదల చేశారు. ఇప్పటికైన పంచాయతీ అధికారులు పంచాయతీ స్థలాలను కాపాడాలని లేకుంటే ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని పలువురు గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు.

నడకతో ఆరోగ్యకర సమాజం

వీరవాసరం: నడకతోనే ఆరోగ్యకర సమాజ నిర్మాణం సాధ్యపడుతుందని జిల్లా కెరీర్, మానసిక ఆరోగ్య సలహాదారు నవీన్ కుమార్ తెలిపారు. బుధవారం కొణితివాడ జెడ్పీ హై స్కూల్‌లో మానసిక ఆరోగ్యంపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నవీన్‌కుమార్ మాట్లాడుతూ మనసు ఆరోగ్యంగా ఉంటే జీవితం సాఫీగా సాగుతుందని తెలిపారు. ఇటీవలి కాలంలో ఒత్తిడి, నిరాశ, ఆందోళన వంటి సమస్యలు చిన్న వయసులోనే పెరుగుతున్నాయి. వీటిని నియంత్రించడానికి రోజువారీ జీవనశైలిలో చిన్న మార్పులు చాలా ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ప్రతిరోజూ తగినంత నిద్ర (7–8 గంటలు) తీసుకోవడం మనసు ప్రశాంతంగా ఉండేందుకు అత్యవసరమన్నారు. వ్యాయామం మన శరీరానికి మాత్రమే కాదు, మనసుకు కూడా శక్తినిస్తుంది. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం మండా రామ కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోండి

ఉండి: మండలం ఎన్నార్పీ అగ్రహారంలోని ప్రభుత్వ ఐటీఐలో ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో నిర్వహించే 45 రోజుల ఉచిత కంప్యూటర్ కోర్సు(ఫ్రంట్ ఆఫీస్ అసిస్టెంట్) కొరకు ఆశక్తి గల మహిళలు ఈ నెల 15వ తేదీ లోపుగా దరఖాస్తు చేసుకోవాలని ఐటీఐ జిల్లా కన్వీనర్, ప్రిన్సిపల్ డీ ఆనంద్‌వేణుగోపాల్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆశక్తి గల మహిళలు 10వ తరగతి పాస్ అయిన వారు ఆధార్, విద్యార్హత సర్టిఫికెట్లు, ఫోటో, ఫోన్ నంబర్, ఈమెయిల్ ఐడీతో ఐటీఐకి నేరుగా వచ్చి దరఖాస్తులు ఆన్‌లైన్ చేయించుకోవాలని తెలిపారు. ఇతర వివరాల కొరకు 9492885556 నంబర్లో ఏపీఎస్ఎస్‌డీసీ కోఆర్డినేటర్‌ను సంప్రదించాలని తెలిపారు. మహిళలు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మావుళ్లమ్మవారిని దర్శించుకున్న మాజీ మంత్రి రోజా



మావుళ్లమ్మ సన్నిధిలో మాజీ మంత్రి ఆర్‌కె రోజా, ఎమ్మెల్సీలు కవురు శ్రీనివాస్, వరుదు కల్యాణి

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం పట్టణంలో మావుళ్లమ్మను మాజీ మంత్రి ఆర్‌కె రోజా, ఎమ్మెల్సీలు కవురు శ్రీనివాస్, వరుదు కల్యాణిలు దర్శించుకున్నారు. వీరికి ఆలయ ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు ఆశీర్వచనాలు నిర్వహించారు. దేవస్థానం సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ శేషవస్త్రం ప్రసాదాలు, శ్రీ అమ్మవారి చిత్రపటం అందజేశారు.

సీజేఐపై దాడి యత్నం హేయం



భీమవరంలో నిరసన తెలుపుతున్న నాయకులు

భీమవరం: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి యత్నం హెయమైన చర్యని..దీనికి బాధ్యుడైన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్ చేశారు. న్యాయమూర్తిపై దాడిని నిరసిస్తూ బుధవారం సీపీఐ, సీపీఎం, ఫార్వర్డ్ బ్లాక్, ఎంసీపీఐయూ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో భీమవరం పాత బస్‌స్టాండ్ రోడ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి ఆందోళన చేశారు. అనంతరం భీమారావు మాట్లాడుతూ చెప్పులతో, బూట్లుతో నిమ్న వర్గాలను అవమానించడం సనాతన ధర్మంలో నిత్యకృత్యంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. గత పదకొండేళ్ల విద్వేష పాలనకు పరాకాష్టగా సీజేఐపై దాడి జరిగిందని ఇటువంటి దుశ్చర్యలపై కఠిన చర్యలు తీసుకోకపోతే మతోన్మాదులు హత్యలకు కూడా పాల్పడతారని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి గోపాలన్ మాట్లాడుతూ సీజెఐపై జరిగిన దాడి ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిందని, పాలకులు ప్రేరణతోనే ఇది జరిగిందని ధ్వజమెత్తారు. ఎంసీపీఐయు జిల్లా నాయకుడు కె మహంకాళి, ఫార్వార్డ్ బ్లాక్ డివిజన్ కార్యదర్శి దండు శ్రీనివాసరాజు మాట్లాడుతూ సీజెఐపై నిస్సిగ్గుగా దాడి జరగడం శోచనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, ఎం సీతారాంప్రసాద్, మల్లుల శ్రీనివాసరావు, వైవిఆనంద్, నాగిడి శాంతమూర్తి, ఖాన్ భాషా, సిపిఎం నాయకులు బి వాసుదేవరావు, ఎం వైకుంఠరావు, డి త్రిమూర్తులు, ఎం ఆంజనేయులు, ఎన్ కనకరాజు, నడింపల్లి హరనాథరాజు, తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీపై అవగాహన

పాలకోడేరు: మండలంలోని పెన్నాడ గ్రామంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జీఎస్టీపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ తంగిరాల హరి ఆనంద ప్రసాద్ మాట్లాడుతూ జీఎస్టీపై అవగాహన కొరకు విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందించారు. పంచాయతీ కార్యదర్శి దుర్గా భ్రమరాంబిక, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొప్పర్తి సురేష్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఏ.బి.ఎస్. ఆర్ మనోహర్,విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి అడవి బాపిరాజు



అడవి బాపిరాజు జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ఎంపీ పాక

భీమవరం: బహుముఖ ప్రజ్ఞాశాలి అడవి బాపిరాజు అని రాజ్యసభ సభ్యుడు పాక వెంకట సత్యనారాయణ అన్నారు. బుధవారం భీమవరంలో అరసవల్లి ఈశ్వరమ్మ, వీర వెంకటాచారి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బాపిరాజు జయంతి కార్యక్రమం నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. బాపిరాజు వ్యక్తి కాదని మహాశక్తి అన్నారు. గొనాగన్న రెడ్డి, హిమబిందు, నారాయణ ప్రపంచపు అంచులలో వంటి ఆయన రచనలు పాఠకుల హృదయాల్లో నిలిచిపోయయన్నారు. ట్రస్ట్ అధ్యక్షుడు అరసవల్లి సుబ్రమణ్యం మాట్లాడుతూ తిక్కన, సముద్ర గుప్తుడు లాంటి చిత్రాలు గీశారని, 1939లో సినీ రంగప్రవేశం చేసి అనసూయ, ధ్రువ విజయం, మీరాబాయి లాంటి సినిమాలకు కళా దర్శకత్వం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో కలిగొట్ల గోపాలశర్మ, కళా రంజని నాటక పరిషత్ అధ్యక్షుడు జవ్వాది ధాశరధిశ్రీనివాస్, చెరుకువాడ రంగసాయి, ఎస్ కే చాన్ భాషా, ద్వారపురెడ్డి త్రివిక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేద్దాం

ఉండి: జిల్లాలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేసేలా పార్టీ అభిమానులు, కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులంతా సమష్టిగా కృషి చేద్దామని పార్టీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడు మేడిద జాన్సన్ అన్నారు. పార్టీ మేధావి విభాగం నియోజకవర్గ కన్వీనర్, యండగండి సర్పంచ్ గోగులమండ చినకృష్ణమూర్తి, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి గొర్రుముచ్చు సుందర్‌కుమార్ తదితర మండల పార్టీ నాయకులు బుధవారం భీమవరంలో జాన్సన్‌ను కలిసి పుష్పగుచ్చాలు ఇచ్చి అభినందించారు. ఈ సందర్భంగా జాన్సన్ మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరిని మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గుర్తుంచుకుంటారని వారికి తగిన విధంగా సత్కరిస్తారని తెలిపారు. పార్టీ కోసం కష్టపడిన వారికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. నమ్మి ఓట్లేసిన ప్రజలను నట్టేట ముంచిన కూటమి ప్రభుత్వంపై ప్రజలంతా గుర్రుగా ఉన్నారని పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అండగా ఉండి వారికి న్యాయం జరిగేలా పోరాడాలని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాదిన్నర పాలన జరిగినా ఇచ్చిన మాటను పూర్తి స్థాయిలో నిలబెట్టుకోకుండా అంతా చేసేసామని, ఇచ్చిన హామీలు నిలబెట్టుకున్నామని చేసుకుంటున్న పండుగలను చూసి ప్రజలంతా ఆశ్చర్యపోతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేరేలా ప్రజలంతా సంతోషంగా ఉండేలా వారి పక్షంగా ఎల్లప్పుడూ వైఎస్సార్ సీపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు వెలగపల్లి టోనీ, బండి మధు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం విక్రయాలపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ మురళీకృష్ణ

పాలకొల్లు సెంట్రల్: వాట్సాప్ షెడ్యూల్ ద్వారా రైతులు నేరుగా ఎన్ని బస్తాలు అమ్ముకోవాలనుకుంటున్నారో అన్ని బస్తాలనే షెడ్యూల్ చేసుకోవచ్చని వ్యవసాయ శాఖ ఏడీఏ పి.మురళీకృష్ణ అన్నారు. బుధవారం పోడూరు మండలంలో వాస్తా, డీఏ, కస్టోడియన్ ఆఫీసర్, సొసైటీస్ సిబ్బందికి ఖరీఫ్ ధాన్యం కొనుగోలుపై శిక్షణ ఇచ్చారు. మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రస్తుతం ధాన్యం ధర క్వింటాల్ సాధారణ రకానికి రూ.2369, గ్రేడ్ ఏ రకానికి రూ.2389 నిర్ధారించారని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి ఎం విశ్వాసరావు, ఎంఎల్‌వో బీవీ శేషుబాబు, డీటీ కేవీవీ సత్యనారాయణ, ఆర్ఐ రంబాబు, ఏఈఓ వి.చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న సర్పంచ్ బొల్లా శ్రీనివాస్

పాలకోడేరు: సుపోషిత్ భారత్ – సక్షం భారత్ లో భాగంగా బుధవారం విస్సాకోడేరు గ్రామ పంచాయతీ వద్ద గ్రామ సర్పంచ్ బొల్లా శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఐసీడీఎస్ సిబ్బందిచే ×పోషణ మ్హా యాక్టివిటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆకివీడు ఐసిడిఎస్ ప్రాజెక్టు సీడీపీఓ వాణి విజయరత్నం మాట్లాడుతూ పుట్టిన గంటలోపే బిడ్డకు ముర్రు పాలు ఇవ్వాలని తద్వారా బిడ్డకు రోగ నిరోధక శక్తి పెరగడమే కాకుండా పౌష్టికాహారం అందించినట్టు అవుతుందన్నారు. అలాగే 6 నెలలు నిండిన పిల్లలకు తల్లిపాలతో పాటు అనుబంధ ఆహారం ఇవ్వాలని, ఏ వయస్సుకి ఎంత ఆహారం ఇవ్వాలి? ఎన్ని సార్లు ఇవ్వాలి అనే విషయాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అప్పారావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పార్వతి, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుల్లో కిక్కిరిసి ప్రయాణం

పెనుమంట్ర: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగింది. బుధవారం అన్ని రూట్లలోనూ బస్సులు నిండిపోవడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రయాణికులు నానా అవస్థలు పడ్డారు. సీఎం చంద్రబాబు ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణానికి సంబంధించి బస్సులు సంఖ్య పెంచకపోవడం వల్ల ప్రయాణికుల చావుకు వచ్చిందని మహిళలు, వృద్ధులు కూటమి ప్రభుత్వాన్ని దుమ్మెత్తి పోశారు. గురువారం అట్లతద్ది సందర్భంగా గ్రామీణ మహిళలు పట్నాలకు వెళ్లడం, తద్దులు తీర్చుకోవడానికి కోడళ్లు, బంధువులు పుట్టిళ్లకు ప్రయాణం కావడంతో బుధవారం బస్సుల్లో రద్దీ ఎక్కువైందని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు.

లయన్స్ సేవలు అభినందనీయం



భీమవరం భవిత స్కూల్లో గ్లాసులు అందజేస్తున్న దృశ్యం

భీమవరం: మానవసేవ ద్వారా సమాజాన్ని బలోపేతం చేయవచ్చునని భీమవరం లయన్స్ అధ్యక్ష, కార్యదర్శులు బొండా రాంబాబు, అల్లు తులసిప్రసాద్, కోశాధికారి కనగర్ల విజయ రామకృష్ణ అన్నారు. భీమవరం భవిత స్కూల్లో (మానసిక స్కూల్) బుధవారం ఇంటర్నేషనల్ లయన్స్ డే సందర్భంగా స్కూల్ విద్యార్థులకు స్టీల్ కంచాలు, గ్లాసులు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ ప్రపంచ వ్యాప్తంగా 200కు పైగా దేశాలలో సామాజిక సేవలు అందిస్తుందని సమాజసేవ, నాయకత్వం, సంక్షేమ కార్యక్రమాలకు లయన్స్ క్లబ్ అంకితమైందన్నారు. ఈ కార్యక్రమంలో సర్వశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ పి శ్యామ్‌సుందర్, ఐఇ కోఆర్డినేటర్ టి శ్రీనివాస్, స్కూల్ హెచ్‌ఎం పి శ్రీనివాసరావు, లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యుడు వబిలిశెట్టి కనకరాజు, భట్టిప్రోలు శ్రీనివాసరావు, నందమూరి రాజేష్, ఆర్ లిల్లీగ్రేస్, వై పెద్ది రాజు, బి దుర్గ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలతో ఆరోగ్యవంతమైన సమాజం

జిల్లా ఇమ్యూనిటీ వైద్యాధికారి దేవ సుధ వెల్లడి



స్థానిక అర్బన్ హెల్త్ సెంటర్‌ను సందర్శించి జిల్లా వ్యాధినిరోధక అధికారిణి దేవ సుధ

ఆకివీడు: వ్యాధి నిరోధక టీకాలతో ఆరోగ్యవంతమైన సమాజాన్ని సృష్టించాలని జిల్లా ఇమ్యూనిటీ వైద్యాధికారిణి దేవ సుధ చెప్పారు. స్థానిక అర్బన్ హెల్త్ సెంటర్‌ను బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా చిన్న పిల్లలకు ఇస్తున్న 11 రకాల టీకాల గురించి స్థానిక వైద్యురాలు ఎండీ. నజీమ్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ జిల్లాలో 252 పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలలో 11 రకాల టీకాల మందు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. పుట్టిన శిశువు దగ్గర నుంచి ఐదేళ్ల వరకూ వేయాల్సిన టీకాలు సకాలంలో వేయడం ద్వారా పిల్లల్లో వ్యాధినిరోధక శక్తి వృద్ధి చెందుతుందన్నారు. జిల్లాలో మజిల్స్(అమ్మోరు), రుబెల్లా వ్యాధుల్ని తుదిముట్టించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. ఇప్పటికే టీకాలు వేయడం ద్వారా వ్యాధి ఉధృతి తగ్గిందన్నారు. 10 నెలల లోపు పిల్లలకు ఒకసారి, 16 నెలల లోపు పిల్లలకు ఒక సారి వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని సూచించారు. ఏడాదిన్నరలో రెండు టీకాలు వేయించడం ద్వారా వ్యాధులు ప్రబలకుండా ఉంటాయన్నారు. సర్వేకల్ క్యాన్సర్ (హెచ్‌పీవీ) వ్యాక్సిన్ ఉందని, అయితే ప్రభుత్వ సరఫరా లేదని విలేకర్లు అడిగిన ప్రశ్నకు ఆమె సమాధానం చెప్పారు. త్వరలో వ్యాక్సిన్ మంజూరు చేసే అవకాశం ఉందన్నారు. కౌమార దశలో ఉన్న యువతులకు ఈ వ్యాక్సిన్ రెండు దోసులు వేయాలన్నారు. ప్రైవేట్ మార్కెట్‌లో రూ. 2 వేలు ఖరీదు ఉందని చెప్పారు. వ్యాక్సిన్ వేయించుకోవడం ద్వారా గర్భకోశ క్యాన్సర్ రాదన్నారు. అర్బన్ హెల్త్ సెంటర్‌కు త్రీఫేస్ కరెంట్ అవసరమవుతుందని చెప్పారు. టీకాలు కూలింగ్ బాక్సుల్లో ఉంచాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో వైద్యురాలు నజీమ్, సిబ్బంది ఉన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత



మాట్లాడుతున్న కరిబండి రామకృష్ణ

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రతి రోజూ యోగా చేయడం ద్వారా మానసిక ప్రశాంతత కలుగుతుందని లయన్స్ కరిబండి రామకృష్ణ అన్నారు. అలాగే నడక, వ్యాయామలు తప్పనిసరి చేసుకోవాలని పలువురు వక్తలు తెలిపారు. లయన్స్ క్లబ్ ఆఫ్ డైమండ్స్ ఆధ్వర్యంలో మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం పేరిచర్ల ఫౌండేషన్ అధ్యక్షుడు మురళీ కృష్ణంరాజు సహకారంతో బుధవారం స్థానిక బాలికోన్నత పాఠశాలలో నిర్వహించారు. లయన్స్ ఇంద్రవాణి అధ్యక్షత వహించారు. విద్యార్థులచే ధాన్యం చేయించారు. యోగాసనాలు వేయించారు. వక్తలు మాట్లాడుతూ కౌమరదశలో వచ్చే మార్పులు, మానసిక ఆరోగ్యం, చదువులు, భవిష్యత్తు కోసం ముందుస్తుగా పునాది, భాగోద్వేగాలు అర్థం చేసుకోవడం తదితర విషయాలపై అవగాహన చేశారు.

భారీ వర్షంతో రోడ్లు జలమయం

వాహనదారులకు తప్పని ఇబ్బందులు



రాష్ట్రీయ రహదారిపై వర్షపు నీటిలో వాహనదారులు ఇక్కట్లు



కాళ్ళలో కాలువని తలపిస్తోన్న పల్లపువీధి

కాళ్ల: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం కురిసిన భారీ వర్షానికి జనజీవనం స్తంభించింది. రహదారులన్ని జలమయమయ్యాయి. ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారులు సైతం కాలవలను తలపించాయి. ఉదయం నుంచి తీవ్ర ఎండ కాచి సాయంత్రం సమయంలో ఒక్కసారిగా ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి రహదారులపై మోకాళ్ల లోతు పైనే వర్షపునీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ప్రధానంగా మండల కేంద్రమైన కాళ్ల గ్రామంలో సినిమా హాల్ సెంటర్ శివాలయం వద్ద రాష్ట్రీయ రహదారి చెరువులను తలపించే విధంగా వర్షపు నీరు నిలిచింది. దీంతో ప్రయాణికులు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పట్టారు. గ్రామంలో పల్లపు వీధి కాలువను తలపించింది. స్థానికులు బయటికి వచ్చేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలు వర్షంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు.